సాక్షి
కాకినాడ

శనివారం । 21 । జూన్ । 2025



ఉపయోగాలెన్నో...

దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లు, అనారోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు యోగా ఎంతో దోహద పడుతుంది. యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..


8 లో



పచ్చ పార్టీలో కొత్త రచ్చ

టీడీపీలో అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. చంద్రబాబునాయుడు అనుసరించే రెండు కళ్ల సిద్ధాంతం సొంత పార్టీ నేతల మధ్య అగాధాన్ని పెంచుతోంది.

డెల్టాలకు 11,300 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 11,300 క్యూసెక్కుల నీటిని వదిలారు. తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.55 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

23న ఒలింపిక్ డే రన్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 23న జిల్లావ్యాప్తంగా 8 ప్రాంతాల్లో ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కాకినాడ, తుని, పిఠాపురం, జగ్గంపేట, కరప, సామర్లకోట, ఉప్పాడ కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో ఆ రోజు ఉదయం 8 గంటలకు ఈ రన్ ప్రారంభమవుతుందని వివరించారు. కాకినాడలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో కలెక్టర్ షణ్మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఈ రన్‌ను ప్రారంభిస్తారన్నారు. రన్‌లో పాల్గొనే వారికి ఐడియల్ విద్యా సంస్థల నుంచి ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. ఒలింపిక్ సంఘ కార్యదర్శి జి.ఎలీషాబాబు మాట్లాడుతూ, జిల్లాలోని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొని ఈ రన్‌ను విజయవంతం చేయాలని కోరారు. రన్ నిర్వహణ ఏర్పాట్లను ఒలింపిక్ సంఘం చైర్మన్ చుండ్రు గోవిందరాజు, సంఘ నిర్వహణ కార్యదర్శి వి.రవిరాజు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

ఘనంగా చండీహోమం



చండీహోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పండితులు హోమం ప్రారంభించి, 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవార్లకు వేదాశీస్సులు, నీరాజన మంత్రపుష్పాదులు సమర్పించారు. ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. వేద పండితులు ఉపాధ్యాయుల రమేష్, వనదుర్గ ఆలయ అర్చకుడు కోట వంశీ, పరిచారకులు, బాలు, వేణు వ్రత పురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. హోమంలో 25 మంది భక్తులు రూ.750 టికెట్టుతో పాల్గొన్నారు. సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యాన, కొండ దిగువన తొలి పావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి కూడా అర్చకుడు చిట్టిం హరగోపాల్ ఆధ్వర్యాన పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు.

నేడు యోగా దినోత్సవం



కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కాకినాడ నూకాలమ్మ గుడి నుంచి మూడు లైట్ల జంక్షన్ మీదుగా దేవదాయ శాఖ కార్యాలయం వరకూ 3 వేల మందితో శనివారం ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకూ పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ సగిలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సమయంలో ఈ మార్గంలో వాహనాలను ప్రత్యామ్నాయ రహదారుల్లోకి మళ్లించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్ నియంత్రించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లాలో 10.88 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 9.70 లక్షల మందికి సర్టిఫికెట్లు జారీ చేశామని తెలిపారు. వీరందరూ భాగస్వాములయ్యేలా జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు యోగాంధ్ర కష్టాలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఆర్టీసీ ప్రయాణికులు యోగాంధ్ర కష్టాల్లో చిక్కుకున్నారు. విశాఖపట్నంలో ప్రభుత్వం నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి ప్రజలను భారీగా తరలించేందుకు కాకినాడ డిపో నుంచి 66 బస్సులను కేటాయించారు. డిపోలో మొత్తం 166 బస్సులుండగా యోగాంధ్ర కార్యక్రమానికి కేటాయించగా మిగిలిన 100 బస్సులతోనే ప్రయాణికులు శుక్రవారం సర్దుకోవాల్సి వచ్చింది. రాజమహేంద్రవరం, అమలాపురం, విశాఖపట్నం వెళ్లేందుకు ప్రతి అరగంటకు అందుబాటులో ఉండే నాన్‌స్టాప్ బస్సులు, కాకినాడ నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే పల్లె వెలుగు బస్సుల సంఖ్య తగ్గిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఏలేశ్వరం, గోకవరం, జగ్గంపేటతో పాటు పలు గ్రామాలకు వెళ్లే సర్వీసులు కూడా బాగా తగ్గిపోయాయి. దీంతో, ప్రయాణాలకు ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు.

అసమ్మతి కుంపటి

ఆయనొద్దు



- పిఠాపురంలో 'గ్లాస్'మేట్స్ ఆధిపత్య పోరు
- 'మర్రెడ్డి'పై జనసేన నేతల అసంతృప్తి
- స్థానికులను విస్మరిస్తున్నారని ఆగ్రహం
- రాజకీయ అనుభవం లేదని విమర్శ
- పనుల పంపకాలపై గుర్రు
- పెద్దల వద్దకు 'పంచాయితీ'!
- సమన్వయ కమిటీ ఏర్పాటుపై తర్జన భర్జనలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: మిత్రభేదంతో సతమతమవుతున్న జనసేనకు పిఠాపురంలో కొత్త కుంపట్లు రాజుకున్నాయి. టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ రూపంలో జనసేన ఈ నియోజకవర్గంలో ఇప్పటికీ పెద్ద సవాల్‌నే ఎదుర్కొంటోంది. ఆయన రాజకీయాన్ని తట్టుకునేందుకు ఆ పార్టీ నేతలు నానా తంటాలూ పడుతున్నారు. ఈ తలనొప్పి ఇలా కొనసాగుతూండగానే పులి మీద పుట్రలా నియోజకవర్గంలో పార్టీపై ఆధిపత్యం కోసం 'గ్లాస్'మేట్స్ కుమ్ములాడుకుంటున్నారు. వారిని దారికి తెచ్చుకోలేక ఆ పార్టీ సతమతమవుతోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో పిఠాపురం నుంచి ఎన్నికై, ఉప ముఖ్యమంత్రి అయిన పవన్ కల్యాణ్ ఈ నియోజకవర్గానికి చుట్టపుచూపుగా వచ్చి పోతూంటారు. తమ్ముడి తోడ్పాటుతో శాసన మండలి సభ్యుడైన ఆయన అన్న, సినీ నటుడు నాగబాబు కూడా అదే మార్గం అనుసరిస్తున్నారు. ఆయన నియోజకవర్గానికి వస్తే ఏదో ఒక కొత్త సమస్య రాజేసి పోతూంటారనేది బహిరంగ రహస్యమే. ఏరు దాటి తెప్ప తగలేసిన చందంగా.. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మపై పరోక్షంగా లేనిపోని విమర్శలు చేస్తూ నాగబాబు కొత్త తలపోట్లు తెచ్చి పెడుతూంటారు. పవన్ ఇక్కడి నుంచి పోటీ చేయాలని అనుకున్నప్పటి నుంచీ ఈ నియోజకవర్గంలో జనసేన బాధ్యతలను నాగబాబుకు వరుసకు తోడల్లుడైన మర్రెడ్డి శ్రీనివాస్‌కు అప్పగించారు. కోనసీమ జిల్లాలోని మండపేట నియోజకవర్గం ద్వారపూడికి చెందిన మర్రెడ్డి స్వతహాగా రాజకీయ నాయకుడు కాదు. రాజకీయాల్లో ఎటువంటి అనుభవమూ లేదు. అయినప్పటికీ ఆయనను నియోజకవర్గ ఇన్‌చార్జిని చేసినా, పవన్‌పై అభిమానంతో ఆ పార్టీ నేతలు, అభిమానులు మొదట్లో పెద్దగా పట్టించుకోలేదు.

తోడల్లుడు కావడమే అర్హతా?

గత ఎన్నికల్లో కూటమి గద్దెనెక్కి, పవన్ ఉప ముఖ్యమంత్రి అయినప్పటి నుంచీ పిఠాపురం ఇన్‌చార్జి పదవి కోసం జనసేనలో కుమ్ములాటలు మొదలయ్యాయి. పవన్, నాగబాబు అందుబాటులో లేకపోవడంతో నియోజకవర్గంపై ఆధిపత్యం చెలాయించాలనే ఆశావహుల జాబితా రోజులు గడిచేకొద్దీ చాంతాడులా పెరుగుతోంది. ఎవరి మట్టుకు వారే ఈ పదవి కోసం ఆరాటపడుతూ ప్రస్తుత ఇన్‌చార్జి మర్రెడ్డి మైనస్‌లపై ఫోకస్ చేస్తున్నారు. రాజకీయాల్లో అనుభవం లేకున్నా కేవలం నాగబాబుకు వరుసకు తోడల్లుడు కావడమే అర్హతగా ఇన్‌చార్జిని చేశారన్నది ఆ పార్టీ నేతలు మొదటి నుంచీ లోపాయికారీగా విమర్శిస్తున్నారు. దీనికి తగ్గట్టుగానే ఇప్పటి వరకూ మర్రెడ్డికి పైనుంచి కింది వరకూ అంతటి ప్రాధాన్యం ఇస్తూ వస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయింది. ఈ నేపథ్యంలో జనసేన ఇన్‌చార్జిగా మర్రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు, అధికారిక, అనధికారిక కార్యక్రమాల్లో అవలంబిస్తున్న వైఖరిపై ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. ఎంపిక చేసుకున్న కొందరికి మాత్రమే ఆయన పార్టీలో ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలున్నాయి. దీనిని ఆవిర్భావం నుంచీ పార్టీ వెన్నంటి నిలిచిన నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో, ఆ పార్టీలో సొంత సామాజికవర్గ నేతలే మర్రెడ్డికి తాజాగా కుంపటి రాజేస్తుండటం జనసేనలో హాట్‌టాపిక్‌గా మారింది.

విభేదాలకు 'తొలి గంట'

గతంలో గొల్లప్రోలు మండలం చేబ్రోలు సీతారామ స్వామి దేవస్థానం ఉత్సవాల సందర్భంగా తొలి గంట కొట్టే విషయంపై రెండు వర్గాలు ఘర్షణకు దిగాయి. ఆ సందర్భంగా మర్రెడ్డి ఒక వర్గానికి కొమ్ము కాయడం అప్పట్లో రచ్చరచ్చ అయ్యింది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కు చేబ్రోలులోని తన ఇంటిని ఓదూరు నాగేశ్వర రావు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జనసేన పార్టీలో తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆయన వర్గం మర్రెడ్డిని బహిరంగంగానే నిలదీసింది. దీనిని సాకుగా తీసుకుని చేబ్రోలులో పవన్‌కు ఇచ్చిన ఇంటిని కావాలనే ఖాళీ చేయించి, పార్టీకి, పవన్‌కు స్థానికంగా అడ్రస్ లేకుండా చేశారని ఓదూరు వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇలా అనేక సమస్యలు ఉత్పన్నమైనప్పుడు మర్రెడ్డి సమయస్ఫూర్తితో సర్దుబాటు చేయలేకపోతున్నారని ఆయన వ్యతిరేక వర్గం పార్టీ పెద్దల దృష్టికి తీసుకు వెళ్లిందని చెబుతున్నారు. అంతటి రాజకీయ అనుభవం ఆయనకు లేని విషయమై ముఖ్య నేతలకు గట్టిగా చెప్పారని సమాచారం. అదే సందర్భంలో స్థానికేతరుడైన మర్రెడ్డి స్థానే స్థానికులకు ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్‌ను తెర మీదకు తీసుకు వచ్చారు. ఈ నేపథ్యంలో మర్రెడ్డికి కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) చైర్మన్ పదవి కట్టబెట్టి, పార్టీలోని అర డజను మంది నేతలతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలనే విషయమై తర్జనభర్జనలు జరుగుతున్నాయి.

రూ.కోట్ల కోసం కొట్లాటలు

ఇటీవల పవన్ నియోజకవర్గానికి కేటాయించిన రూ.4 కోట్ల పనుల పంపకాల అంశం కూడా ఆ పార్టీ నేతల మధ్య మరింత అగ్గి రాజేసిందనే చర్చ జరుగుతోంది. పనుల కేటాయింపులో మర్రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించారంటూ కొందరు నేతలు పార్టీ ముఖ్యుల వద్ద 'పంచాయితీ' పెట్టారని సమాచారం. తనకు నచ్చిన ఒకరిద్దరికి మాత్రమే ఆయన పనులు అప్పగించడం మిగిలిన నేతలకు రుచించడం లేదు. అకస్మాత్తుగా విదేశాల నుంచి వచ్చిపడిన వారికి పదవుల పంపకంలో ప్రాధాన్యం ఇవ్వడాన్ని ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న నేతలు తీవ్రంగా విభేదిస్తున్నారు. అందునా ఇటీవల మంజూరైన నీటిపారుదల, రహదారుల వంటి పనులను నేతల రూపంలో ఉన్న ఇద్దరు కాంట్రాక్టర్లకు కట్టబెట్టడంపై వారు గుర్రుగా ఉన్నారు. అకస్మాత్తుగా వచ్చిపడిన నేతలకు ఇస్తున్న ప్రాధాన్యం తమకెందుకివ్వడం లేదని పలువురు నిలదీస్తున్నారు. ఇటీవల పిఠాపురం రూరల్ ఎఫ్‌కే పాలెం, విరవాడ గ్రామాలకు చెందిన పాపిడిదొడ్డి చెరువులో జరిగిన మట్టి తవ్వకాల్లో పంపకాల విషయంపై జనసేనలో ఇరు వర్గాల మధ్య కొట్లాటలు కూడా జరిగాయి. రెండు వర్గాలూ పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి. కానీ, మర్రెడ్డి అనుయాయుడి ఫిర్యాదు పైనే పోలీసులు కేసు నమోదు చేసి, వైరివర్గం ఫిర్యాదును పట్టించుకోలేదు. దీంతో, అగ్గికి ఆజ్యం పోసినట్టయ్యింది.

జగన్‌ను భూస్థాపితం చేయడం ఎవ్వరి తరమూ కాదు



నాగమణి

కాకినాడ రూరల్: ప్రజల గుండెల్లో ఉన్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని భూస్థాపితం చేయడం ఎవ్వరి తరమూ కాదని ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి అన్నారు. గైగోలుపాడులోని తన నివాసంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రజలు తాము అభిమానించే నాయకుడిని కలుసుకోవడం కూడా తప్పే అన్నట్లు చిత్రీకరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. జగన్‌ను భూస్థాపితం చేస్తామని చంద్రబాబు, తల నరికేస్తామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలను దిగజార్చి, హత్యా రాజకీయాలను ప్రోత్సహించే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు కూడా జగన్ ఓడిపోయాడు తప్ప చచ్చిపోలేదంటూ గతంలో వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. గతంలో చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాల ద్వారానే ఎన్టీఆర్‌ను భూస్థాపితం చేయడానికి ప్రయత్నించారని, అది సాధ్యం కాదని గ్రహించి, నేడు అధికారం కాపాడుకునేందుకు ఆయన విగ్రహాలను పూజిస్తున్నారని అన్నారు. నాయకుడిగా ఎదగకూడదనే దురుద్దేశంతో వంగవీటి మోహన్‌రంగాను భూస్థాపితం చేశారని ఆరోపించారు. గోరంట్ల, అయ్యన్నపాత్రుడి వ్యాఖ్యలను కోర్టులు సుమోటోగా స్వీకరించి, తమ నాయకుడు జగన్‌కు రక్షణ కల్పించాలని నాగమణి విజ్ఞప్తి చేశారు.

నేడు స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్

కాకినాడ సిటీ: జిల్లావ్యాప్తంగా శనివారం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టరేట్ నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. నీరు–మీరు అంశంతో ఈ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నీటి కుంటలు, చెరువులు, ప్రజా మరుగుదొడ్లు, ప్రధాన రహదారులు, కూడళ్లను శుభ్రపరచడం, చెత్త కుప్పల తొలగింపు, మురికి కాలువల ప్రక్షాళన, ఇతర పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, అవగాహన సదస్సులు, ర్యాలీలు, ప్రతిజ్ఞలు నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ జె.వెంకటరావు, డీఈఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మరింత సమర్థంగా రెవెన్యూ సేవలు



రెవెన్యూ దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ షణ్మోహన్, ఇతర అధికారులు

కాకినాడ సిటీ: ప్రభుత్వ పాలనలో రెవెన్యూ శాఖది అత్యంత కీలక పాత్ర అని, మారుతున్న కాలానికి అనుగుణంగా మరింత సమర్థతతో ప్రజలకు సేవలందించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రెవెన్యూ సిబ్బంది తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. డీఆర్‌ఓ జె.వెంకటరావు మాట్లాడుతూ, భూమి ఉన్నంత వరకూ రెవెన్యూ శాఖ ఉంటుందని అన్నారు. పుట్టుక నుంచి మరణం వరకూ రెవెన్యూ శాఖ సేవలు అందిస్తుందని చెప్పారు. ఈ శాఖలో నూతన అంశాలు, చట్టాలపై రెవెన్యూ అధికారులు, సిబ్బంది అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్, డీఆర్‌ఓ తదితరులు తోట సుధాకర్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ, ఏపీజీఏ, వీఆర్ఓ, వీఆర్ఏ, ఆఫీస్ సబార్డినేట్ అసోసియేషన్ల జిల్లా అధ్యక్షులు పి.త్రినాథరావు, ఎం.జగన్నాథం, చిన్నారావు, అబ్బులు, ఎస్.చిన పాపారావు, కలెక్టరేట్ ఏఓ రామ్మోహన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

28 నుంచి సంపూర్ణ ఘనపారాయణ

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని శ్రీ దత్తాత్రేయ వేద విద్యా గురుకులంలో ఈ నెల 28 నుంచి వచ్చే నెల 27వ తేదీ వరకూ శ్రీ కృష్ణ యజుర్వేద సంపూర్ణ ఘన పారాయణ నిర్వహిస్తున్నారు. సంస్థ కార్యనిర్వాహక సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. గురుకుల రజతోత్సవాల సందర్భంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఇక్కడే విద్యనభ్యసించిన 16 మంది ఘనపాఠీలు పాల్గొంటున్నారన్నారు. ఈ సంవత్సరం సంస్థ వ్యవస్థాపకుడు గుళ్ళపల్లి సీతారామచంద్ర ఘనపాఠీ షష్టిపూర్తి సంవత్సరం కూడా కావడం మరో విశేషమని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఘనపారాయణ, పండితులచే వేద ప్రాశస్త్యంపై ప్రవచనాలు జరుగుతాయని, ఆస్తికులు పాల్గొని, ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

వికాసలో 23న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఈ నెల 23న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కీర్తి మెడికల్ స్టోర్స్‌లో సీనియర్ ఫార్మసిస్ట్, సర్కిల్ ఎగ్జిక్యూటివ్ బ్రాంచి మేనేజర్, ముత్తూట్ గ్రూప్ కంపెనీలో ఇంటర్న్, పీఓఎఫ్ఓ, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీలో టెలి సేల్స్ రిప్రజెంటేటివ్, ఇసుజు మోటార్స్, హోండాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, బీటెక్, బి-ఫార్మసీ, డి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ, ఎంబీఏ, ఎంకామ్ పాసైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.23 వేల వరకూ జీతం, ఉద్యోగాలను బట్టి ఇన్సెంటివ్‌లు, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా టూ వీలర్ టెక్నీషియన్, లాజిస్టిక్స్‌లో శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించనున్నారని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలుంటాయన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ కార్యాలయానికి సర్టిఫికెట్ల జిరాక్సులతో సోమవారం హాజరు కావాలని లచ్చారావు సూచించారు.

ఆధ్యాత్మికతకు ధర్మ పరిక్రమణ యాత్ర

దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనంద తీర్థాచార్యులు



ఆనంద తీర్థాచార్యులు

ఆలమూరు: హిందూ ధర్మ పరిరక్షణ, హిందూ మత వ్యాప్తి కోసం ధర్మ పరిక్రమణ యాత్ర చేపట్టి గ్రామీణ, తీర ప్రాంతాల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు దాస సాహిత్య ప్రాజెక్టు తీవ్రంగా కృషి చేస్తోందని ప్రత్యేక అధికారి విద్వాన్ పగడాల ఆనంద తీర్థాచార్యులు తెలిపారు. ఆలమూరు మండలం జొన్నాడలో మూడు రోజుల నుంచి జరుగుతున్న శ్రీపురందరదాసు సంకీర్తనల శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేద, ఉపనిషత్, పురాణాల సారాంశాన్ని రంగరించి పురందరదాసు సుమారు 4.70 లక్షల సంకీర్తనలు రచించారన్నారు. ఈ కీర్తనలన్నీ కన్నడ భాషలో ఉండడం వల్ల అందులో ఉన్న సారాన్ని తెలుగు వారికి అర్థమయ్యే విధంగా తర్జుమా చేయించామన్నారు. ఆ కీర్తనలు ఆలపించే విధానాన్ని భజన మండలి సభ్యులకు నేర్పడానికి ఏటా మహిళా భక్త బృంద సభ్యులకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. దాస సాహిత్య ప్రాజెక్ట్‌లో భాగంగా కోస్తా జిల్లాల్లో ప్రస్తుతం 4,862 భజన మండళ్లు ఉండగా వీటిల్లో 8,694 మంది మహిళా సభ్యులు ఉన్నారని తెలిపారు. దాస సాహిత్య ప్రాజెక్ట్‌లో ఉన్న హరే శ్రీనివాస భక్తభజన మండళ్ల సభ్యులందరూ సంకీర్తన యజ్ఞంతో పాటు కోలాటానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని కొనియాడారు. దాస సాహిత్య ప్రాజెక్టు విస్తరణకు, నిర్వహణకు టీటీడీ రూ.2.50 కోట్లు మంజూరు చేసిందని ఆయన చెప్పారు.

హిందుత్వం వైపు ఆకర్షితులను చేస్తాం

గిరిజనులు, దళితులు దాస సాహిత్య ప్రాజెక్టు పట్ల ఆసక్తి కనబర్చి హిందూత్వం వైపు ఆకర్షించేలా ఈ ధర్మ పరిక్రమణ యాత్ర దోహదపడుతుందని ఆనంద తీర్థాచార్యులు తెలిపారు. మత మార్పిడుల నివారణకు టీటీడీ ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. హిందుత్వానికి ఉన్న వైభవాన్ని వివరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా జూలై 15న ధర్మ పరిక్రమణ యాత్రను ప్రారంభిస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో హరే శ్రీనివాస భజన మండళ్ల ఏర్పాటులో, నిర్వహణలో ఆలమూరు అయ్యప్ప స్వామి ఆలయ నిర్వాహకులు ముకుంద స్వామి కృషి ప్రశంసనీయమని అన్నారు.

ఇసుకాయ స్వాహా!



పి.గన్నవరం మండలం పెదకందాలపాలెం నుంచి వస్తున్న ఇసుక లారీలు

- మళ్లీ జోరందుకున్న దందా
- అధికారిక ర్యాంపుల్లో నిలిచిన తవ్వకాలు
- ఇదే అదనుగా అనధికార ర్యాంపులు
- పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో అక్రమ తవ్వకాలు
- అదనంగా రాజోలు, అయినవిల్లిలో కూడా..
- ఒకవైపు అక్రమ తవ్వకాలపై మైనింగ్ శాఖ పరిశీలన.. మరోవైపు ఆగని తవ్వకాలు

సాక్షి, అమలాపురం: గోదావరి నదీపాయల్లో అక్రమ ఇసుక తవ్వకాలు మళ్లీ జోరందుకున్నాయి. వర్షాలు, వరదల సీజన్ మొదలు కావడంతో అధికారిక ఇసుక ర్యాంపుల్లో తవ్వకాలు నిలిపివేయడం, స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక లభ్యత తక్కువగా ఉండడం అక్రమార్కులకు వరంగా మారింది. వర్షాలు లేకపోవడంతో ఇసుకకు నెలకొన్న డిమాండ్‌కు తోడు.. ర్యాంపులోకి వెళ్లే దారులకు ఇబ్బందులు లేకపోవడంతో అక్రమార్కులు బరి తెగించారు. కోనసీమ జిల్లాలోని గోదావరి నదీపాయల్లో ఇసుక దందా జోరందుకుంది. గౌతమీ, వైనతేయ, వశిష్ఠ నదీపాయాల్లో ఇష్టానుసారం ఇసుక తవ్వేస్తున్నారు. జిల్లాలో ర్యాంపులు ఉన్న సమయంలో కూడా ఇక్కడ ఇసుక దందా ఆగలేదు. ఇప్పుడు ర్యాంపులు మూతపడడంతో మరింత చెలరేగిపోతున్నారు. అనువుగా ఉన్నచోట గుర్తించి ఇసుక తవ్వుకుని పోతున్నారు. సాధారణంగా ఈ సమయంలో వర్షాలు పడితే మట్టి తవ్వకాలు జరిగే అవకాశం లేదు. పైగా ర్యాంపులు వేసి ఇసుక, మట్టి తవ్వలేరు. వర్షాలు లేక వాతావరణం కలిసి రావడం అక్రమార్కులకు వరంగా మారింది.

పి.గన్నవరంలో మరింత దోపిడీ

పి.గన్నవరం మండలంలో ఈ దోపిడీ మరింత పెరిగింది. కీలక ప్రజాప్రతినిధుల వత్తాసుతో అక్రమార్కులు ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. ఇక్కడ ఇసుక, మట్టి వంటి సహజ వనరుల దోపిడీ నిర్విఘ్నంగా సాగిపోతోంది. మండల పరిధిలోని ఊడిమూడి, మానేపల్లి, కందాలపాలెం ప్రాంతంలో లంక మట్టి, ఇసుక, తువ్వ ఇసుక తవ్వుతున్నారు. టీడీపీ, జనసేనకు చెందిన కొంతమంది సిండికేటుగా మారి ఇక్కడ అక్రమ దందా చేస్తున్నారు. అపరాధ రుసుము చెల్లించాలని వీరికి అధికారులు నోటీసులు జారీ చేసినా దందా మాత్రం ఆగడం లేదు. మండలంలో పెదకందాలపాలెం, ఎల్.గన్నవరం పరిధిలోని యర్రంశెట్టివారి పాలెం లంక, ఊడిమూడిలంక, మానేపల్లిలో ఇసుక, మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. బెల్లంపూడి లంకలో ఒక వారం రోజులు తవ్వకాలు జరిపారు. స్థానికుల నుంచి ఒత్తిడి రావడంతో నిలిపివేశారు.

నదీ గర్భంలో లోతుగా..

అక్రమ దందాకు తోడు నిబంధనలు తోసిరాజని నదీ గర్భంలో లోతుగా తవ్వకాలు జరపడం గమనార్హం. మీటరు నుంచి రెండు మీటర్ల లోతున తవ్వేస్తున్నారు. దీనివల్ల సమీప గ్రామాల ఉనికే ప్రమాదభరితంగా మారింది. వైపీ పాలెం ఏటిగట్టు దిగువన, ఊడిమూడి తదితర ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వర్షాలు వస్తే సాధ్యం కాదన్న ఉద్దేశంతో తవ్వకాల్లో జోరు పెంచారు. ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని మైనింగ్, రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. తప్పదన్నట్టు అప్పుడప్పుడూ దాడులు చేసి జేసీబీలు, లారీలను సీజ్ చేస్తున్నారు. అయినా దందా ఆగడం లేదు. చీకటి పడితే చాలు అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. గ్రామస్తులు అడ్డుకుంటున్నా వారు లెక్క చేయడం లేదు. దోపిడీ మరింత వేగంగా సాగిపోతోంది.

అపరాధ రుసుము అంటూ అధికారుల హంగామా

పి.గన్నవరంలో సాగుతున్న ఈ అక్రమ ఇసుక దందా సిండికేటుగా మారింది. ఒక మహిళా సర్పంచ్ భర్త, ఒక మండల స్థాయి నేత కుమారుడు, కూటమి పార్టీకి చెందిన నాయకులు ఈ దందా నిర్వహిస్తున్నారు. ఇక్కడ అక్రమ తవ్వకాలు సాగుతున్నాయని ఇప్పుడు గుర్తించిన అధికారులు తవ్వకాలు చేస్తున్నవారి వద్ద నుంచి అపరాధ రుసుము రూ.2.31 కోట్లు వసూలు చేస్తామని చెబుతున్నారు. అయితే గనుల శాఖకు చెందిన అధికారులు గతంలోనూ ఇదే విధంగా అపరాధ రుసుము అంటూ హడావుడి చేసినా అక్రమార్కులు చెల్లించిన పాపాన పోలేదు. అధికారులు భయపెడుతున్నా తవ్వకాల దందా ఆగకపోవడం విశేషం.

రాజోలుకూ పాకింది

గోదావరి నదీపాయల్లో అక్రమ ఇసుక తవ్వకాలు ఇప్పుడు పి.గన్నవరం నియోజకవర్గం దాటి రాజోలు నియోజకవర్గంలోనూ విస్తరించాయి. రాజోలు మండలం సోంపల్లి, మలికిపురం మండలం దిండిలో తవ్వకాలు మొదలయ్యాయి. ఇక్కడ పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. బ్యాక్ వాటర్ కారణంగా ఇక్కడ పడవల మీద ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. ఇక్కడ తవ్వుతున్న ఇసుక స్థానికంగా కన్నా పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం, పాలకొల్లు వంటి ప్రాంతాలకు అధికంగా ఎగుమతి అవుతోంది.



పి.గన్నవరం మండలం బెల్లంపూడిలంక వద్ద మట్టి తవ్వకాలు (ఫైల్)

క్లుప్తంగా

చేరికలపై కుమ్ములాట

సోషల్ మీడియా వేదికగా టీడీపీ, బీజేపీ విమర్శలు

గోకవరం: కలిసి సాగుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి పార్టీలు గ్రామస్థాయిలో మాత్రం కుమ్ములాడుకుంటున్నాయి. తమ పార్టీ వాళ్లను బలవంతంగా చేర్చుకున్నారని ఒక పార్టీ ఆరోపిస్తుండగా ఇష్టపడే వచ్చారని మరో పార్టీ అంటోంది. సోషల్ మీడియా వేదికగా విమర్శలకు దిగుతున్నారు. గోకవరం మండలం గాదెలపాలెం గ్రామంలో సోమవారం బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కొందరికి పార్టీ కండువాలు వేశారు. వారికి ఆ మరుసటి రోజు టీడీపీ నాయకులు పచ్చ కండువాలు వేసి వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయితే దైవ కార్యక్రమం అని పిలిచి తమకు బలవంతంగా టీడీపీ కండువాలు వేశారని, బీజేపీలోకి వెళితే పథకాలు నిలిపివేస్తామని టీడీపీ నేతలు తమను బలవంతం పెట్టడంతో ఆ విధంగా కండువాలు వేసుకున్నామని, కానీ తాము బీజేపీలోనే కొనసాగుతామని వారు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ విధంగా రెండు పార్టీల మధ్య సాగుతున్న పోస్టుల యుద్ధాన్ని చూసినవారు ముక్కున వేలేసుకుంటున్నారు. కూటమి సఖ్యత ఏడాదికే ఈ విధంగా ఉంటే.. రాను రానూ ఎలా ఉంటుందోనని చర్చించుకుంటున్నారు.

బాలిక అదృశ్యం

దేవరపల్లి: నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలో 17 ఏళ్ల బాలిక అదృశ్యంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. తాడేపల్లిగూడెం రూరల్ మండలం ఆరుగొలనుకు చెందిన బాలిక ఘంటావారిగూడెంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. ఈ నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్ల వద్ద, చుట్టుపక్కల గ్రామాల్లో వెదికారు. ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

కరప: నడకుదురు శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై కరప పోలీసులు దాడిచేసి, ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.8,222 నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన కథనం కరప మండలం నడకుదురు శివారులో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందడంతో కరప ఎస్‌ఐ టి.సునీత సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న నిందితులను తీసుకుని, నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకుని కరప పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులను కాకినాడ కోర్టులో ప్రవేశపెడతామని పోలీసులు తెలిపారు.

ఉపయోగాలెన్నో...

- మానసిక ఒత్తిడి నుంచి విముక్తికి చక్కటి మార్గం
- జిల్లాలో పెరుగుతున్న ఆదరణ
- పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

రాయవరం: దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లు, ఒడిదొడుకుల కారణంగా అధిక శాతం ప్రజలు బీపీ, సుగర్, థైరాయిడ్, ఊబకాయం, ఆస్తమా, నరాల బలహీనత వంటి అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఫలితంగా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ వేలు, లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అయినా రోగాలు పూర్తిగా నయం కాని పరిస్థితి. ఇటువంటి రోగాలు, రుగ్మతలను జయించడానికి నిత్యం యోగా సాధన చేయాలని గురువులు సూచిస్తున్నారు. రోజూ అరగంట నుంచి గంట వరకు యోగాసనాలు వేస్తే మానసిక ప్రశాంతతతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందంటున్నారు.

2015 నుంచి ప్రపంచ యోగా దినోత్సవం

భారతదేశంలో పుట్టిన యోగా నేడు ప్రపంచ దేశాలకు విస్తరించింది. భారతదేశ ప్రతిపాదనను ఐక్యరాజ్య సమితి గుర్తించి 2015 జూన్ 21 నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. జూన్ 21న సూర్య గ్రహం భూమధ్య రేఖకు దూరంగా ఉంటుంది. ఆ రోజు దినంలో సమయం కొద్దిగా ఎక్కువగా ఉంటుంది.

అందరిలోనూ ఆసక్తి

జిల్లాలో యోగా నేర్చుకోవాలనే ఆసక్తి అన్ని వయసుల వారిలోనూ పెరుగుతోంది. అందుకు అనుగుణంగా శిక్షణ కేంద్రాలు వెలుస్తున్నాయి. అమలాపురం, మండపేట, రావులపాలెం, కొత్తపేట, రామచంద్రపురం, రాయవరం, రామచంద్రపురం, ద్రాక్షారామ, రాజోలు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పలు యోగా సెంటర్లలో శిక్షణ పొందేందుకు రోజూ వేల సంఖ్యలో తరలివస్తున్నారు. కొన్ని చోట్ల స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా యోగా శిక్షణ అందిస్తున్నాయి.

యోగాడే నిర్వహణకు ఏర్పాట్లు

విద్యార్థి దశ నుంచే యోగాపై ఆసక్తి నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా ఏటా పాఠశాలలు, కళాశాలల్లో యోగాడేను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా యోగాడేను పాఠశాలల్లో ఘనంగా నిర్వహించాలని సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పాఠశాలల్లో యోగాడే ప్రాధాన్యాన్ని వివరిస్తూ, పాఠశాలల్లో నిర్వహించిన యోగాడే కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను గూగుల్ ట్రాకర్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పలు పాఠశాలల్లో యోగా తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నారు. దీనికి విద్యార్థుల నుంచి స్పందన లభిస్తోంది. కొన్ని విద్యాసంస్థలలో ఉదయం, సాయంత్రం వెసులుబాటును బట్టి రోజూ అరగంట విద్యార్థులకు యోగా శిక్షణ అందిస్తున్నారు. తద్వారా చిన్నారులలో క్రమశిక్షణ పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక పరమైన ఆరోగ్య సమస్యలు దూరమవుతున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు.



యోగాసనం వేస్తున్న బాలిక

నేడు పాఠశాలల్లో..

ప్రపంచ యోగా దినోత్సవాన్ని అన్ని పాఠశాలల్లో నిర్వహించడానికి జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి జిల్లాలో ఉన్న 2,081 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు పాఠశాల షెడ్యూల్‌లో మార్పులు చేశారు. శనివారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు మధ్యాహ్నం 12.30 గంటల వరకు పనిచేస్తాయి. జిల్లాలో 2.10 లక్షల మంది పాఠశాల విద్యార్థులతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐ తదితర విద్యాసంస్థల్లో యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

లాభాలు ఇవీ...

- యోగా ద్వారా ఏకాగ్రత పెరుగుతుంది.
- ఏ రంగానికి చెందినవారైనా తమ విధులపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తారు.
- ఒత్తిడి, మానసిక ఆందోళనలతో సతమతమయ్యేవారు యోగాపై దృష్టి సారిస్తే ప్రయోజనం ఉంటుంది.
- యోగాసనాలు వేయడం వల్ల శ్వాసకోశ వ్యాధులతో బాధపడే వారికి ఉపశమనం లభిస్తుంది.
- నిత్యం యోగా వల్ల విద్యార్థులలో జ్ఞాపక శక్తి పెంపొందుతుంది.
- యోగాసనాల వల్ల శరీరంలో రక్తప్రసరణ వ్యవస్థ ఉత్తేజమై ఆరోగ్య సమస్యలు దరి చేరవు.



యోగాసనాలు నేర్పిస్తున్న యోగా గురువు

పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా..



వ్యాధుల నియంత్రణకు, మానసికంగా ధృఢత్వాన్ని సాధించడానికి యోగా ఉపయోగపడుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో సాధనతో ప్రతి ఒక్కరూ ఉత్తేజితులవుతారు. శరీరం, మనసుపై అదుపు ఏర్పడుతుంది. 17 ఏళ్లుగా యోగాను ఉచితంగా నేర్పించడాన్ని పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. – వెలగల ఫణికృష్ణారెడ్డి, యోగా గురువు, రాయవరం

దినచర్యలో భాగం కావాలి



యోగా మన దినచర్యలో భాగం కావాలి. యోగా చేయడం వలన దీర్ఘకాలిక వ్యాధులు దరి చేరవు. ధ్యానం, ప్రాణాయామం వంటివి ఒత్తిడిని దూరం చేస్తాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ సునాయాసంగా యోగా చేయవచ్చు.
– అల్లూరి శ్రీనివాసచౌదరి, యోగా శిక్షకుడు, లొల్ల, రాయవరం మండలం

విస్తృత ప్రయోజనాలు



యోగా సాధన మనిషి జీవితంలో గణనీయమైన మార్పులను తీసుకుని వస్తుంది. యోగాతో విస్తృత ప్రయోజనాలు ఉంటాయి. అంతరంగాన్ని చదివే దిశగా మనిషిని యోగా ప్రేరేపిస్తుంది. విద్యార్థి దశ నుంచి యోగాను నేర్పిస్తే ఉత్తమ పౌరులు తయారవుతారు.
– జి.మమ్మీ, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం

పచ్చ పార్టీలో కొత్త రచ్చ

- పెందుర్తి, వెంకటరమణ చౌదరి వర్గాల మధ్య ఉప్పునిప్పు
- ఆజ్యం పోస్తున్న సీనియర్ గోరంట్ల

సాక్షి టాస్క్‌ఫోర్స్: తెలుగుదేశం పార్టీలో అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. చంద్రబాబునాయుడు అనుసరించే రెండు కళ్ల సిద్ధాంతం సొంత పార్టీ నేతల మధ్య అగాధాన్ని పెంచుతోంది. పార్టీలో సీనియర్ నాయకులుగా భుజకీర్తి తగిలించుకుని తిరిగేవారు సైతం ఈ అగాధాన్ని మరింత పెంచుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజానగరం నియోజకవర్గంలో పెందుర్తి వెంకటేష్, బొడ్డు వెంకటరమణచౌదరిల మధ్య పదవులు కేటాయింపు విషయంలో విభేదాలు ఏర్పడ్డాయి. పార్టీ వ్యవహారాలతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో సైతం ఈ రెండు వర్గాలు తమ ప్రాధాన్యాన్ని చాటుకునేందుకు పోటీ పడుతున్నాయి. ఈ నేపథ్యంలో కార్యకర్తల మధ్య ఏర్పడే వివాదాలను సైతం ఇరువర్గాలు ప్రెస్టేజీయస్‌గా పరిగణిస్తున్నాయి. తమ వ్యతిరేకవర్గం వారిని పోలీసుల సాయంతో అణిచివేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రూరల్ నియోజకవర్గం పరిధిలోని తొర్రేడు గ్రామంలో టీడీపీ కార్యాలయం వద్ద రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరిల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే ఆ ఫ్లెక్సీలో సీఎం ప్రోగ్రాం కన్వీనర్ పెందుర్తి వెంకటేష్ ఫొటో లేదని, ఆయన కుమారుడు అభిరామ్ అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. దీంతో స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులతో వారికి వాగ్వాదం చోటు చేసుకుంది. రెండు వర్గాల మధ్య జరుగుతున్న వివాదాన్ని పార్టీ సీనియర్ నాయకుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి సర్దుబాటు చేసే ప్రయత్నం చేయకపోగా స్వంత పార్టీ కార్యకర్తలపైనే రాజానగరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించడం ప్రస్తుత వివాదాన్ని మరింత పెద్దది చేసింది. బుచ్చయ్య ఇలా ఒక వర్గం వారికే ప్రాధాన్యం ఇస్తూ మరో వర్గం వారిపై కేసులు పెట్టించడం ప్రస్తుతం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర స్థాయి పదవిలో ఉన్న తమ నాయకుడి ఫొటో లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంలో బుచ్చయ్య ప్రమేయం కూడా ఉందని పెందుర్తి వర్గీయులు అనుమానిస్తున్నారు. గోరంట్ల రవిరామ్‌కిరణ్ ఫొటో పెట్టగా లేనిది సీఎం ప్రోగ్రాం కన్వీనర్‌గా ఉన్న తమ నాయకుడి ఫొటో ఎందుకు ఫ్లెక్సీలో పెట్టకూడదని పెందుర్తి అనుచరులు ప్రశ్నిస్తున్నారు. అభిప్రాయ భేదాలు ఉండడం సహజమని, పార్టీ కార్యాలయం వద్ద ఉన్న ఫ్లెక్సీలను పెందుర్తి వర్గీయులు ధ్వంసం చేయడం ముమ్మాటికీ తప్పేనని పార్టీలో పలువురు అభిప్రాయపడుతున్నారు. బొడ్డు వెంకట రమణ చౌదరి, పెందుర్తి వెంకటేష్ వర్గీయుల మధ్య ఉన్న వివాదాలను మరింత పెంచే విధంగా గోరంట్ల వ్యవహరించడాన్ని కూడా పార్టీ నేతలు తప్పుబడుతున్నారు. పార్టీలో ప్రాధాన్యమైన పదవులు కేటాయించే సమయంలో తనకు పెందుర్తి అడ్డురావచ్చన్న భావనతోనే అక్కడ బొడ్డు వెంకటరమణచౌదరిని బుచ్చయ్య ప్రోత్సహిస్తున్నారన్న అభిప్రాయం కూడా పార్టీలో ఉంది. మొత్తమ్మీద ప్రస్తుత వివాదంలో గోరంట్ల వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తోంది.

ఫ్లెక్సీల చించివేతపై కేసు

తొర్రేడు గ్రామంలో టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో సీఎం చంద్రబాబు, ప్రోగ్రాం కన్వీనర్ పెందుర్తి వెంకటేష్ ఫొటో వేయలేదని ఆయన కుమారుడి అనుచరులు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరిల ఫొటోలు గురువారం చించివేశారు. దీనిపై తొర్రేడు గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఫిర్యాదు మేరకు ముగ్గళ్లకు చెందిన గెడ్డం అనిల్‌కుమార్, కాటవరానికి చెందిన కాట్రగడ్డ శివ, తొర్రేడు గ్రామానికి చెందిన చిట్టూరి సురేంద్రలపై కేసు నమోదు చేశారు.



తొర్రేడులో చించేసిన గోరంట్ల ఫ్లెక్సీ



తొర్రేడులో చించేసిన రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ ఫ్లెక్సీ

సముద్రంలో అలజడి

- వెస్సల్‌లో దొంగతనానికి విఫలయత్నం
- ఐదుగురు చొరబాటుదారుల అరెస్టు

కాకినాడ క్రైం: కాకినాడ కోస్టుగార్డు తీరానికి సమీపాన సముద్రంలో అలజడి రేగింది. గురువారం సాయంత్రం తీరంలో 16 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న వెస్సల్ పైకి ఐదుగురు చొరబాటుదారులు ఎక్కి దొంగతనానికి విఫలయత్నం చేశారు. ఎంవీవీ జీహెచ్ పాథ్ ఫైండర్ అనే ఆఫ్‌షోర్ సపోర్ట్ వెస్సల్ వీహెచ్ఎఫ్ కమ్యూనికేషన్ ఈ సమాచారాన్ని కాకినాడ కోస్టుగార్డు తీరానికి చేర్చి అప్రమత్తం చేసింది. తక్షణమే స్పందించిన కోస్టుగార్డ్ సిబ్బంది సమీపాన గస్తీలో ఉన్న ఇంటర్ సెప్టర్ బోట్ ఐసీజీఎస్ సీ–438 ను చొరబాటుదారుల పనిపట్టేందుకు దారి మళ్లించి పంపింది. మత్స్యకార నౌకలో దోపిడీకి ప్రయత్నం చేసిన చొరబాటుదారులు ఇంటర్ సెప్టర్‌ను చూసి పారిపోవడానికి ప్రయత్నం చేశారు. బోర్డింగ్ బృందం చురుగ్గా స్పందించి ఐదుగురిని పట్టుకొని కాకినాడ తీరానికి తరలించింది. ఈ ఉదంతంపై కోస్టుగార్డు అధికారులు కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు చొరబాటుదారులను అరెస్టు చేశారు. పూర్తి వివరాలు సేకరించే క్రమంలో విచారిస్తున్నారు.

ఉద్యోగాలు కోల్పోయి ఏడో నెలొచ్చినా..



ఏపీ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ప్రసాద్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఉన్నా ఉద్యోగాలు కోల్పోయి ఏడో నెలొచ్చినా వైద్య ఆరోగ్యశాఖలోని ఆరోగ్య సహాయకులు విశాఖపట్నంలో జరుగుతున్న యోగా వేడుకల్లో పాల్గొనేందుకు కదిలారని ఆంధ్రప్రదేశ్ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీ.వీ.వీ.ప్రసాద్ అన్నారు. ఆయన గురువారం విశాఖపట్నం వెళుతూ రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖలో ఆరోగ్య సహాయకులుగా ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న దాదాపు వెయ్యి మందిని కోర్టు ఆదేశం పేరుతో విధుల నుంచి తొలగించడంతో రోడ్డున పడ్డారన్నారు. నెలలు గడుస్తున్నా నేటికీ విధుల్లోకి తీసుకోలేదని ఆవేదన చెందారు. ఉన్నతాధికారుల మాటల ఊరటతో తప్పకుండా తమకు న్యాయం జరుగుతుందని ఏడు నెలలుగా ఎదురుచూపులు చూస్తున్నామన్నారు. ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా విశాఖలో జరుగుతున్న ×యోగాంధ్ర విజయం కోసం.. ఆరోగ్యాంధ్రా సాధన కోసం ఉద్యోగాలు కోల్పోయిన ఆరోగ్య సహాయకులు వందలాదిగా తరలి వెళుతున్నారని ప్రసాద్ చెప్పారు. వరదలు, తుపానులు వచ్చినప్పుడు మేము చేసే సేవలు అనంతమని, అదే సేవా స్ఫూర్తితో స్వచ్ఛంద సేవకు ముందుకురావడం ఆరోగ్య సహాయకులు పెద్ద మనస్సుకు నిదర్శనమని ప్రసాద్ కొనియాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా కనికరించి త్వరితగతిన తిరిగి ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని వారు కన్నీళ్లతో అభ్యర్థిస్తున్నారన్నారు.

23 నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ



కెఎస్‌వీ ప్రసాద్

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో తూర్పుగోదావరి జిల్లా మహిళా సర్పంచ్‌ల శిక్షణ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలేరు జిల్లాలలోని ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలకు మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ ఇచ్చామన్నారు. వారు ఆయా జిల్లాల్లో ఈ నెల 26 నుంచి సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తారని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లాలోని సర్పంచ్‌లకు ఈటీసీలో శిక్షణ ఉంటుందన్నారు. మహిళల హక్కులు, బాధ్యత, సమాజంలో వారి పాత్రపై శిక్షణ నిర్వహిస్తామన్నారు. రాజకీయాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించినా వాటిని ఉపయోగించకపోవడంతో వారిలో అవగాహన పెంచడానికి ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. సర్పంచ్‌గానే కాకుండా మహిళగా ఆమె చేయవలసిన పనులను తెలియజేస్తామన్నారు.

26 నుంచి ఎంపీపీలకు...

ఈ నెల 26వ తేదీ నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన ఎంపీపీలకు ఈటీసీలో శిక్షణ ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. మండల పరిధిలో గ్రామసభల నిర్వహణ, మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం, జిల్లా పరిషత్తు సమావేశాల్లో వారి పాత్రలపై శిక్షణలో వివరిస్తామన్నారు.


ఐటీఐల్లో రెండవ విడత ప్రవేశాలకు నోటిఫికేషన్

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కాకినాడ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో రెండవ విడత ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు కాకినాడ, కోనసీమ జిల్లాల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ శుక్రవారం ఒక ప్రకటనలతో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా జూలై 15వ తేదీ లోపు ఆన్‌లైన్ సెంటర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏ ఐటీఐలో చేరదల్చుకున్నారో, సంబంధిత ఐటీఐని ఆన్‌లైన్ దరఖాస్తులో ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మొదటి విడతలో ఐటీఐ సీట్లు రాని అభ్యర్థులు కూడా తప్పనిసరిగా రెండవ విడత ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులందరూ దగ్గరలోని ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఐటీఐలో జూలై 17వ తేదీ లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని, అప్రూవల్ పొందాలన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోని వారు కౌన్సెలింగ్‌కు అర్హులు కాదని వేణుగోపాలవర్మ తెలిపారు. సందేహాలు ఉంటే 08842348182 లేదా 9440408182 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

యోగా డే కోసం మూడు రోజులు సెలవులా..

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): యోగా డే సందర్భంగా 8 జిల్లాల బస్సులను తరలించేందుకు విద్యాసంస్థలకు 3 రోజులు సెలవు ఇవ్వడం దారుణమని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో విశాఖపట్నంలో యోగా డే ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. దీనికి 8 జిల్లాల నుంచి విద్యాసంస్థల బస్సులను, ఆర్టీసీ బస్సులను తీసుకువెళ్లారన్నారు. దీంతో పాఠశాలలకు విద్యాసంస్థలకు గురువారం, శుక్రవారం, శనివారం మూడు రోజుల పాటు సెలవు ప్రకటించారన్నారు. రాష్ట్రంలో చాలాచోట్ల పోటీ పరీక్షలు జరుగుతున్నాయని, ఈ సమయంలో ఆర్టీసీ బస్సులను అందుబాటులో లేకుండా ప్రభుత్వం తమ చేతుల్లో పెట్టుకోవడం సరికాదన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



మోర్తలో మృతురాలు పుల్లూరి సంధ్య

ఉండ్రాజవరం: భార్యాభర్తల మధ్య వివాదం నేపథ్యంలో భార్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండలంలోని మోర్త గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఉండ్రాజవరం ఏఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలో మోర్త గ్రామానికి చెందిన పుల్లూరి నాగేశ్వరరావుతో నిడదవోలు మండలం మునిపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి సంధ్య(22)కు ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సహస్ర, బాల శ్రీవల్లి ఉన్నారు. ఈ నెల 19వ తేదీన భార్యాభర్తలు తగదా పడ్డారు. శుక్రవారం ఉదయం భర్త పొలానికి వెళ్లేముందు తనతో మాట్లాడటం లేదని మనస్తాపానికి గురైన సంధ్య ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పొలం వెళ్లిన భర్త నాగేశ్వరరావు బయట హోటల్ నుంచి టిఫిన్ తీసుకుని ఇంటికి రాగా.. బెడ్‌రూమ్‌లో భార్య ఉరి వేసుకొని ఉండడాన్ని గమనించి, వెంటనే స్థానిక వైద్యులను సంప్రదించగా ఆమెను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి కరింకి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రామకృష్ణ తెలిపారు.

నేటి నుంచి వైద్యుల నమోదు ప్రక్రియ

కాకినాడ క్రైం: వైద్యుడిగా అనుమతులు పొంది ఐదేళ్లు నిండిన లేదా నూతనంగా అనుమతులు పొందనున్న వైద్యుల కోసం జిల్లా కేంద్రంలోనే నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కాకినాడ కార్యదర్శి డాక్టర్ చిట్ల కిరణ్ అన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ పర్యవేక్షణలో, ఏపి మెడికల్ కౌన్సిల్, ఐఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్ఎంసీ డిజిటల్ లైబ్రరీలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో వైద్యుల లైసెన్స్ జారీతోపాటు, పునరుద్ధరణ(రెన్యూవల్) చేస్తారన్నారు. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 300 మంది వైద్యులు రోజుకి 150 మంది చొప్పున హాజరవుతారని డాక్టర్ కిరణ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు జరిగే ఈ ప్రక్రియకు వైద్యులు తగిన ధ్రువపత్రాలతో హాజరుకావాలని ఆయన కోరారు. ఈ – డాక్టర్ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్లు కూడా నిర్వహించే ఈ ప్రక్రియలో ఎంబీబీఎస్ చివరి ఏడాది రిజిస్ట్రేషన్లు చేయరని స్పష్టం చేశారు. తుది నమోదు మాత్రం విజయవాడ ఏపీ మెడికల్ కౌన్సిల్లోనే జరుగుతుందని డాక్టర్ కిరణ్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడి మృతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడు మృతిచెందిన ఘటన ఐఎల్‌టీడీ జంక్షన్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఆత్రేయపురానికి చెందిన వెంకటరావు, అతని కుమారుడు మేడిమి మల్లిక్ (14) కలిసి ద్విచక్ర వాహనంపై రాజమహేంద్రవరం వచ్చారు. పని ముగించుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. ఐఎల్‌టీడీ సమీపంలోనున్న పెట్రోల్ బంక్‌లో వాహనంలో పెట్రోలు పోయించుకున్నారు. అక్కడి నుంచి ఐఎల్‌టీడీ జంక్షన్‌కు వచ్చేసరికి వెనుక నుంచి ఆర్టీసీ బస్సు వచ్చి బలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న వెంకటరావు ఎడమ వైపునకు పడిపోగా, వెనుక కూర్చుని ఉన్న బాలుడు మల్లిక్ కుడివైపునకు పడిపోయాడు. దీంతో ఆర్టీసీ బస్సు చక్రం బాలుడి తలపై నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రికి ఎటువంటి గాయాలు కాలేదు. మల్లిక్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్రచరితం!



ఉత్తర వెంకట్, జెడ్పీ హైస్కూల్, హసన్‌బాద

రామచంద్రపురం రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో 8 వ తరగతి విద్యార్థి ఎం.ఉత్తర వెంకట్ సున్నితమైన జిల్లేడు ఆకును కత్తిరించి రూపొందించిన యోగ ముద్ర విశేషంగా ఆకట్టుకుంటోంది. సాధారణంగా బలంగా ఉండే రావి ఆకు, పనస ఆకులపై ఇటువంటి చిత్రాలు రూపొందిస్తుంటారు. అయితే వెంకట్ జిల్లేడు ఆకుపై మనోహరంగా చిత్రించిన యోగముద్రను పాఠశాల డ్రాయింగ్ టీచర్ జి. శ్రీను, ప్రధానోపాధ్యాయురాలు పీఎస్‌బీఎస్‌కే సుందరి, ఉపాధ్యాయులు,విద్యార్థులు అభినందించారు.

జిల్లేడు ఆకుపై రూపొందించిన యోగ ముద్ర →



సూక్ష్మ భరితం!



సూక్ష్మ యోగా సింబల్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కాకినాడకు చెందిన సూక్ష్మ కళాఖండాల నిపుణులు అరిపాక రమేష్‌బాబు, సున్నితమైన చాక్‌పీస్‌ని ఉపయోగించి అతి చిన్న అంతర్జాతీయ యోగా సింబల్‌ను తయారు చేశారు. యోగాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ సూక్ష్మ యోగా సింబల్ రూపొందించినట్లు చెప్పారు.



అరిపాక రమేష్ బాబు